క్లుప్తంగా

శివ లింగానికి గంధాభిషేకం



ప్రత్తిపాడు: కార్తిక మాస పూజలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సోమవారాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని శ్రీ గంగా పార్వతి సమేత దండేశ్వరాలయంలో ఆలయ అర్చకులు పత్తిపాటి పరమేశ్వరశర్మ దండేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విభూది, పాలు, పసుపు, కుంకుమ, గంధం, తేనె, పంచామృతాలతో అభిషేకాలు జరిపి దివ్య హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుని, తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ముగిసిన యాప్ డెవలప్‌మెంట్ శిక్షణ శిబిరం



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలని అటైన్ స్మార్ట్ సంస్థ ఫౌండర్ సీఈఓ డీజీ స్టీఫెన్ తెలిపారు. ఆరు రోజులుగా నగర శివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో యాప్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగించుకుని ప్రతి విద్యార్థి యాప్‌ను ఏవిధంగా తయారు చేయాలి, తదితర విషయాలను వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతుల వలన విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతులతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె.భార్గవ్, కె.అరుణకుమారి పాల్గొన్నారు.

లీమా స్కూల్ సందర్శన



పెదకాకాని: లీమా బధిరుల పాఠశాలను గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి సోమవారం సందర్శించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండరు ఆక్టివిటీస్‌లో భాగంగా పాఠశాలను సందర్శించారు. పిల్లల ఆరోగ్యంపై వాకబు చేశారు. కేక్‌కట్ చేయించి వారితో కలసి క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శివరాంప్రసాద్, డాక్టర్ సుష్మిత, డాక్టర్ సోమ శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



చేబ్రోలు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో దేవాలయాలు కార్తిక సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. చేబ్రోలులోని నాగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు శివలింగాకారంలో కార్తిక దీపోత్సవం జరిగింది.

ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో సోమవారం ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో పనిచేస్తున్న ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఎంటీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరగనున్న సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, జిల్లా ఉద్యాన అధికారి రవీందర్‌లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపైఅవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మి, డీఎల్ఎంపీ సత్యనారాయణ, రైతు నేస్తం ఫౌండేషన్ సీఈఓ సాంబశివరావు పాల్గొన్నారు.

– ప్రత్తిపాడు

డ్వాక్రా సంఘాల బలోపేతానికి చర్యలు

డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి గ్రామంలోని మహిళా సంఘాలు.. ఇళ్లకు వెళ్లి, నూతనంగా ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డ్వాక్రా సంఘాలకు వారి స్థితి గతులపై ఎస్‌జీహెచ్ ఇన్‌కం యాప్ ద్వారా సర్వే చేయించటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సభ్యురాలు వ్యక్తి గతంగా, ఆర్థికంగా ఏ పరిస్థితిలో ఉన్నారో చూసి దగ్గరుండి డ్వాక్రా సభ్యులకు వారి పరిస్థితి నేరుగా వారికే అర్థమయ్యేలా వివరించి వారి పురోగతికి ఎలా నిర్ణయాలు చేయాలో అవగాహన కల్పించే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న వీఓఏలను ఉద్దేశించి మాట్లాడుతూ సక్రమంగా పనిచేయకపోయిన, అవినీతికి పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఎం జె.రాంబాబు, ఏపీఎం షాలేమురాజు, సీసీ సుభాషిణి పాల్గొన్నారు.

– గుంటూరు రూరల్



డ్వాక్రా మహిళల ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిరసన



తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న పేదలు

ఏళ్ల తరబడి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని బతుకుతున్నాం.. ఇళ్ల పట్టాలు మంజూరు కోరుతూ మండలంలోని నంబూరు యానాదికాలనీ వాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి నంబూరు అడ్డరోడ్డులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని సుమారు 65 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. పేదలకు కనీస అవసరాలైన రోడ్లు, సైడు కాలువలు, పైపు లైన్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండనక వాననక రాత్రి వేళల్లో చిన్న పిల్లలతో బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారని చెప్పారు. సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి నిరుపేదలైన యానాదులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. లేకుంటే ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

– పెదకాకాని

విజ్ఞాన్‌లో ఘనంగా ‘ఉద్భవ్-2కే24’



మాట్లాడుతున్న డాక్టర్ సుశీల్ కుమార్



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

చేబ్రోలు: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవడంతో పాటు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని విశాఖపట్నంలోని ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుశీల్ కుమార్ కోరారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ ‘ఉద్భవ్-2కే24’ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కైజెన్ (కీ టు ఆంబీషియస్ అండ్ ఇంటెలెక్చుయల్ జోన్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ నోవల్టీ) స్కూల్ ఆఫ్ లా అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక అంతరాయాలు, ప్రపంచీకరణ, మారుతున్న సామాజిక అంచనాల కారణంగా నిర్వహణ రంగం ఎలా అభివృద్ధి చెందుతుందో వివరించారు. సమయాన్ని సరైన రీతిలో వినియోగించుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.

హైదరాబాద్‌లోని మైక్రో ల్యాబ్స్ లిమిటెడ్ సేల్స్ మేనేజర్ వీసీ మురళీకృష్ణ రాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధితోనే జీవితంలో మంచి ఉపాధిని, ఉన్నత స్థానాలను పొందగలరని తెలిపారు. నెట్‌వర్కింగ్, కొలాబరేషన్, డెసిషన్ మేకింగ్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్‌ను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. కార్పొరేట్ ప్రపంచంలో వ్యాపార రంగంలో విజయం సాధించడం, అమ్మకాలు, నాయకత్వ లక్షణాలు, ఆవిష్కరణలు ఎంత ప్రభావ వంతంగా ఉంటాయో వివరించారు. డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం, కస్టమర్ సంబంధాలు, మార్కెటింగ్ రంగంలో అవకాశాలు మరియు మార్కెట్ మార్పుల నేపథ్యంలో అనుకూలత వంటి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. హైదరాబాద్‌లోని డ్రీమ్‌ప్లగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డెప్యూటీ మేనేజర్ రాఘవేంద్ర పొన్నగంటి మాట్లాడుతూ ఇన్నోవేషన్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ మరియు నెట్‌వర్కింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించి విద్యార్థుల సొంత కెరీర్ మార్గాల గురించి, సవాళ్లను ఎలా అధిగమించాలో వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ కంఫర్ట్ జోన్‌లు వదిలి కొత్త సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పోటీ వ్యాపార ప్రపంచంలో ముందుకు సాగడానికి నిరంతర అభ్యాసం, అనుకూలత అవసరమని చెప్పారు. ‘ఉద్భవ్-2కే24’లో భాగంగా విద్యార్థులకు యంగ్ మేనేజర్, బిజినెస్ ప్లాన్, మార్కెట్ మేకర్స్, టీమ్ బిల్డింగ్, హెచ్ఆర్ ఈవెంట్, పేపర్ ప్రజెంటేషన్, బిజినెస్ క్విజ్, మాక్ ట్రేడింగ్, షార్ట్ ఫిల్మ్ కాంపిటీషన్, ట్రెజర్ హంట్, మిస్టర్ అండ్ మిస్ ఉద్భవ్, సోలో డాన్స్, గ్రూప్ డాన్స్, విజ్ఞాన్ ప్రీమియర్ లీగ్, ఫోటోగ్రఫీ కాంపిటీషన్, సింగింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పొన్నూరు: బాలల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ఎస్ఎస్‌టీ పబ్లిక్ స్కూల్లో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, డాన్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. చదువుతో పాటు ఆట పాటలపై కూడా మక్కువ పెంచుకోవాలన్నారు. గత పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొలిపర్తి రత్నం, పాఠశాల ఇన్‌చార్జ్ వెలనాటి రామదాసు పాల్గొన్నారు.



డాన్స్ చేస్తున్న చిన్నారులు

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

పొన్నూరు: ఎన్నికలకు ముందు పేదలకు నివేశన స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరేటి రామారావు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ 25వ వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాపూరి సుగుణ అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించి గృహాలు నిర్మించి ఇస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఇంటి స్థలం ఉంటే గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు నిర్మాణానికి ఇవ్వాలని అన్నారు. దేవరకొండ శ్రీనివాస్ మాట్లాడారు. ధర్నాలో అయ్యప్ప, వలి, మున్నీ, మోతి, కోటేశ్వరమ్మ,, జరీనా, గౌశ, లక్ష్మి, హసీనా, బేగం పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న మహిళలు

నేటి నుంచి ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణంలోని పలు స్కూళ్లు, సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న ఏఎస్‌జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, కొండమూది రోడ్ జెడ్పీహెచ్ స్కూల్, 9వార్డు ఆదికుమార ఎలిమెంటరీ స్కూల్, 20న మున్సిపల్ కార్యాలయం, కొండమూది రోడ్ జెడ్పిహెచ్ స్కూల్, నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్, 21న మున్సిపల్ ఉర్దూ స్కూల్, ఏపీ హైస్కూల్, టీచర్స్ కాలనీ సచివాలయం 1, 22న పాలిటెక్నిక్ కళాశాల, ఏపీ హైస్కూల్, 15 వార్డు సంజయ్‌నగర్ ఎలిమెంటరీ స్కూల్‌లోని శిబిరాల్లో ఆధార్ సేవలు పొందాలని పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

గుంటూరు రూరల్: కార్తిక మాసం పర్వదినాలను పురస్కరించుకుని సోమవారం సందర్భంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలం లోని వెంగళాయపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు రౌతు శ్రీనివాసరావు, కృష్ణారావు, శివలింగంనాయక్, హరిబాబు, రామోజీనాయక్, సుబ్బారావు, గోపి, ఆదర్శ్, దిలీశ, విద్య పాల్గొన్నారు.

మహిళను మోసం చేసిన ఘటనపై ఫిర్యాదు!

పట్నంబజారు: మహిళను ఏమార్చి ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ హిందూ కళాశాల సమీపంలోని ఓ ఏటీఎం సెంటర్ వద్దకు బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా కోసం వచ్చారు. అక్కడ ఉన్న ఓ వ్యక్తి సదరు మహిళకు సాయం చేస్తానని చెప్పి పిన్‌నంబరు అడిగాడు. ఆమె కార్డుకు డబ్బులు రావడం లేదని నమ్మించి అతడి వద్ద ఉన్న నకిలీ ఏటీఎం కార్డు ఆమెకు ఇచ్చి పంపించివేశాడు. ఆమె వెళ్లినట్లు నిర్ధారించుకున్న తరువాత ఆ అకౌంట్ నుంచి రూ.50 వేలు విత్‌డ్రా చేశాడు. నగదు విత్‌డ్రా కావడంతో సదరు మహిళ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీనిపై లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు.

సోమసుందర్ చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: ఏడు దశాబ్దాల సాహితీ వ్యాసరంగంలో నిమగ్నమైన వజ్రా ఆయుధం కవి ఆవంత్స సోమసుందర్ తెలుగు సాహిత్య క్షేత్రంలో గొప్పకవిగా, విమర్శకుడుగా శతాధిక గ్రంథకర్తగా గుర్తింపు పొందారని రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సోమసుందర్ జీవితమే సాహిత్యం అన్న సూక్తి సోమ సుందర్‌కు అక్షరాలా సరిపోతోందన్నారు. గాయకుడు సాహితీవేత్త పి.ఎస్.మూర్తి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఏది రాసినా నమ్మిన సోషలిజం భావనలకు కుల మతాతీత మానవ భావనలను ఎక్కడో అక్కడ వ్యక్తం చేయడం ప్రజల పక్షంగానే నిలబడటం సోమసుందర్‌కి ఇష్టమైన విషయాలన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు

మలినేని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు

ప్రత్తిపాడు: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మలినేని ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ, ఏటీఏఐ ఎడ్యు స్కిల్స్, మైక్రో చిప్ సౌజన్యంతో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు. ఆరు రోజుల పాటు ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కళాశాల చైర్మన్ పెరుమాళ్లు ప్రారంభించారు. పలు విద్యాసంస్థల అధ్యాపకులు శిక్షణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెరుమాళ్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీలతో పోటీపడాలన్నారు. కార్యక్రమ కన్వీనర్, ఈసీఈ విభాగాధిపతి డి.విజయ సారథి మాట్లాడుతూ పరిశ్రమలు ఆశిస్తున్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకి చేరవేయడమే నైపుణ్య శిక్షణ శిబిరం ప్రధాన ఉద్దేశమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. హామీలు అమలు కోరుతూ సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి షేక్ ఖాజాకు వినతిపత్రం అందించారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ప్రభుత్వం గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా ఇంత వరకు హామీ అమలుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సెక్రటరీ మెడ హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాస్, గోపిరెడ్డి నాగిరెడ్డి, సిద్ధి రవి, పి.వీ రారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



ప్రత్తిపాడు పంచాయతీ సెక్రటరీ ఖాజాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెదకాకాని: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యన్నారాయణ అన్నారు. సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం పిలుపు మేరకు సోమవారం నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల్లో ఇళ్ల స్థలాలు కోరుతూ అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటల కుమారి, పి.డేవిడ్రాజు, ఆర్.శ్రీనివాసరావు, సిహెచ్ విజయలక్ష్మి, ఆలా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పెదకాకానిలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.అరుణ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు వాటి వలన ప్రయోజనాలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు, వరదలు వాటి ప్రభావం, నివారణ చర్యలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 60 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయాల ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు రాజు, అక్షయ విద్యాలయం గణిత ఉపాధ్యాయుడు మణిరత్నం పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో రాణించాలి

పెదకాకాని: ఏకాగ్రత పట్టుదల, సృజనాత్మకత జత కలిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టించగలరని ఈఓపీఆర్డీ కె.శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు జూనియర్స్ విభాగంలో స్వాతంత్ర్య సమరయోధుల ముఖచిత్రాలు, సీనియర్స్‌కు స్వచ్ఛ సర్వేక్షణ అనే అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ వెనిగండ్ల స్కూల్ డ్రాయింగ్ టీచర్ భవాని పాల్గొన్నారు.

డిసెంబర్ 10వ తేదీ నాటికి వెండింగ్ జోన్లు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వాస్తవంగా వీధి వ్యాపారులకు డిసెంబర్ పదో తేదీ నాటికి వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని, వీధి వ్యాపారుల సంక్షేమం కోసం చేపడుతున్న పనులపై అసత్య, నిరాధార ఆరోపణలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వెండింగ్ జోన్లు, రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, శంకర్ విలాస్ ఆర్ఓబీ, తాగునీటి సరఫరా అంశాలపై నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలపై కమిషనర్ సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రధానంగా వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా జోన్స్ కేటాయించి వారిని క్రమబద్ధీకరణ చేయాలని, తద్వారా వారికి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కృషి చేస్తుంటే, ఇదే అదునుగా ఇప్పటి వరకు వారిని వివిధ రకాలుగా దోచుకున్న వారు వీధి వ్యాపారుల ముసుగులో వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రధాన రోడ్లు, డ్రెయిన్లు, ఫుట్ పాత్‌లు ఆక్రమణలు పెరిగి ప్రస్తుతం జాతీయ రహదారుల వెంబడి కూడా ఆక్రమణలు పెరిగాయని చెప్పారు. జీఎంసీ చేపట్టిన చర్యలపై ప్రజా ప్రతినిధుల పేరుతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దోచుకున్న, ఆరోపణలు చేస్తున్న వివరాలు సేకరించామని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నామని హెచ్చరించారు. జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నిర్ణయం మేరకు గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా హాస్పిటల్ చుట్టూ ఉన్న ఆక్రమణలను, ట్రాఫిక్ సమస్య రీత్యా గుజ్జనగుండ్ల చెరువు దగ్గర ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు పేర్కొన్నారు.



గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

శంకర్ విలాస్ ఆర్ఓబీ నిర్మాణానికి..

గుంటూరు నగర ప్రజల చిరకాల కోరిక అయిన శంకర్ విలాస్ ఆర్ఓబీ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సాంకేతికంగా వంతెన నిర్మాణం ఆర్‌అండ్ బీ చూస్తున్నప్పటికీ విస్తరణ ప్రభావిత భవనాలకు నష్ట పరిహారం నగరపాలక సంస్థ బాధ్యత అని ఇప్పటికే స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభమైతే నగరంలో సుమారు ఒకటి నుంచి 2 ఏళ్లు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రధానంగా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు అవసరమని అభిప్రాయపడ్డారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేకి ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు నగర ప్రజలు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ మ్యాపింగ్, ఎన్‌పీసీఐ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌పీసీఐ సర్వేలో కార్యదర్శులు ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లకు వారి ఆధార్, ఫోన్ నంబర్‌ని లింక్ చేసుకోవాలని చెప్పారు.

బ్యాంకు అకౌంట్‌లు లేని వారు స్థానిక పోస్ట్ ఆఫీస్‌లో రూ.2తో నూతన అకౌంట్ ఓపెన్ చేసి సచివాలయ కార్యదర్శులకు వివరాలు అందించవచ్చన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా ఇంటి వద్దకు వచ్చే సచివాలయ కార్యదర్శులకు తగిన వివరాలు ఇచ్చి సహకరించాలని కోరారు. నోడల్ అధికారులు ఆయా యాప్ లను డౌన్‌లోడ్ చేసుకొని, క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. నిర్దేశిత గడువు మేరకు సర్వే పూర్తి కావడానికి బాధ్యత తీసుకోవాలన్నారు.